# ఆంధ్ర వైభవము

- సుశ్రీ.

**గత సంచికలలో ...**

ఆంధ్రవిష్ణువు, శాతవాహనులు, ఇక్ష్వాకులు, పల్లవులు, చాళుక్యులు, చోళులు, కాకతీయులు, బొబ్బిలి, విజయనగరరాజులు, రెడ్డిరాజుల గురించి, ఖుతుబ్ షాహీ వంశస్తుల గురించి, అష్టదిగ్గజముల గురించి, బ్రిటిష్ పాలనలో స్వాతంత్ర్య సిద్ధికై కృషి చేసిన దేశభక్తుల గురించి, చిన్నయసూరి, కందుకూరి వీరేశలింగం పంతులుగారు, గురజాడ మొదలైన రచయితలు, సంఘసంస్కర్తల గురించి, బాపూ గారు, ముళ్ళపూడి వెంకటరమణ గారు, చిలకమర్తి లక్ష్మీనరసింహం గారిని గురించి విషయములు ప్రస్థావించడం జరిగింది.

**(గత సంచిక తరువాయి భాగము)**

గోపీచంద్ 'అసమర్థుని జీవయాత్ర', బుచ్చిబాబుగారి 'చివరకు మిగిలేది', రంగనాయకమ్మగారి 'బలిపీఠం', వాసిరెడ్డి సీతాదేవిగారి 'మట్టి మనిషి', గుడిపాటి వెంకటాచలం గారి (చలంగారి) 'ప్రేమలేఖలు', పాలగుమ్మి పద్మరాజుగారి 'గాలివాన', రాచకొండ విశ్వనాథశాస్త్రిగారి (రావిశాస్త్రి) 'బుక్కులు', కాళీపట్నం రామారావుగారి (కారాగారి) 'యజ్ఞం' ప్రసిద్ధ రచనలు.




సాహిత్య సేవకై కృషి చేసిన వారిలో "ఎందరో మహానుభావులు అందరికీ వందనములు" అన్న త్యాగరాజ స్వామివారు, పద కవితా పితామహుడు తాళ్ళపాక అన్నమయ్య భక్తి రసపోషణ చేస్తే, చర్లపల్లి వేంకటశాస్త్రి, దివాకర్ల తిరుపతిశాస్త్రి (తిరుపతి వేంకట కవులు) అవధాన ప్రక్రియని ప్రవేశపెట్టారు. ఈ ప్రక్రియ వేరే ఏ భాషలోనూ కానరాదు. వీరేకాక కొప్పరపు వేంకట సుబ్బరాయ శర్మ, కొప్పరపు వేంకట రమణ శర్మ (కొప్పరపు సోదర కవులు), వేంకట రామకృష్ణ కవులు, వేంకట పార్వతీశ్వర కవులు, పింగళి కాటూరి కవులు - కవి ద్వయములు; నేటి తరములో మేడసాని మోహన్, మాడుగుల నాగఫణిశర్మ, గరికిపాటి నరసింహా రావుగారు ఈ ప్రక్రియని జనబాహుళ్యానికి దగ్గరగా చేర్చారు.

సాహిత్య ధురులేగాక, రాష్ట్రాన్ని సస్యశ్యామలము చేస్తున్న ఎన్నో జీవనదులకు ఈ భూమి నిలయం. మహారాష్ట్రలోని నాసిక్ వద్ద త్రయంబకము వద్ద జనించిన గోదావరి ద్వాదశ మహానదులలో ఒకటి. ఇది బాసర వద్ద ఆంధ్రరాష్ట్రంలో ప్రవేశిస్తుంది. మంజీర, ప్రాణహిత, ఇంద్రావతి, శబరి దీనికి ఉపనదులు. దీనిని గౌతమి అని కూడా పిలుస్తారు. ఈ నదిపై ధవళేశ్వరం, విజ్జేశ్వరం, శ్రీరాం సాగర్ ఆనకట్టలు నిర్మించబడ్డాయి. మహామలేశ్వర్ వద్ద పుట్టిన కృష్ణానది ఆంధ్రప్రదేశ్‌లో రెండవ పెద్దనది. దీనికి తుంగభద్ర, దిండి, మూసి, మున్నేరు, పాలేరు మొదలైన ఉపనదులున్నాయి. ఈ నదిపై శ్రీశైలం (జలవిద్యుత్ ప్రాజెక్టు), నాగార్జునసాగర్ (బహుళార్ధక సాధక ప్రాజెక్టు) ఆనకట్టలు నిర్మించబడ్డాయి. కర్ణాటకలోని పశ్చిమ కనుమలలో పుట్టిన తుంగ, భద్ర అనే నదులు కలసి తుంగభద్ర అవతరించింది. దీనికి శరవతి, కుముద్వతి, వరద, వేదవతి మొదలైన ఉపనదులున్నాయి. పెన్నా నది కర్ణాటకలో పుట్టి, అనంతపురములో ప్రవేశిస్తుంది. దీనికి చిత్రావతి, కుందేరు, పాపాగ్ని, సాగిలేరు వంటి ఉపనదులున్నాయి. ఇక వంశధార ఒరిస్సాలో జయపూర్ ప్రాంతంలో పుట్టి, పాతపట్నం వద్ద ఆంధ్రాలో ప్రవేశిస్తుంది. నాగావళి ఒరిస్సాలోని రాయగడ ప్రాంతంలో పుట్టి ఆంధ్రాలో ప్రవహిస్తున్నది. తాండవ, శారద మొదలైన చిన్న నదులు కూడా ఆంధ్ర రాష్ట్రంలో ఉన్నాయి.


నాగార్జునసాగర్ ఆనకట్ట

ఈ రాష్ట్రంలో దేవాలయములు బహు పురాతనమైనవి. కలియుగ దైవంగా, వడ్డికాసులవానిగా, ఆపదమొక్కులవానిగా, ఏడుకొండలవానిగా కొలువబడుతున్న 'కొండలలో నెలకొన్న కోనేటిరాయడువాడు కొండలంత వరములు గుప్పెడువాడు' తిరుమలలో కొలువుతీరి ఉన్నాడు. భక్తులు ఆనంద పరవశులై గోవింద నామస్మరణ చేస్తూ దీనిని కలియుగ వైకుంఠముగా భావిస్తారు. పసుపు కుంకుమలతో కలకాలం సౌభాగ్యంతో ఉండాలని, సిరిసంపదలతో తులతూగాలని కోరుకుంటూ వేలాది భక్తులు అమ్మవారి దర్శనం చేసుకుంటారు. మల్లికార్జునుడు, భ్రమరాంబికలు వెలసిన శ్రీశైలక్షేత్రం ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటి. శివుని తమదైన శైలిలో కొలిచి దైవసాన్నిధ్యము పొందిన సాలెపురుగు (శ్రీ), పాము (కాళము) మరియు ఏనుగు (హస్తి)ల పేరున వెలసిన శ్రీకాలహస్తి, ద్రాక్షారామం శివుని దేవాలయాలు. విజయవాడలో శ్రీ పర్వతముపై వెలసిన


శ్రీకూర్మం దేవాలయము

కనకదుర్గ ఆలయం అష్టాదశ శక్తిపీఠాలలో ఒకటి. సీతారామ కళ్యాణము తిలకించాలంటే భద్రాచలము చూడవలసిందే. సింహాచలం, ధర్మపురి మరియు యాదగిరి నరసింహస్వామి క్షేత్రాలు. ఇంకా రామప్పగుడి, వేయిస్థంబాల గుడి, మంత్రాలయం, అన్నవరం, వేములవాడ, శ్రీకూర్మం దేవాలయము, అరసవిల్లి సూర్యనారాయణమూర్తి దేవాలయము, విజయవాడలోని కనకదుర్గ దేవాలయము, విశాఖపట్నంలోని కనక మహాలక్ష్మి దేవాలయము, రాజరాజేశ్వరి ఆలయం సందర్శించవలసిన ప్రముఖ ప్రదేశాలు.




టంగుటూరి ప్రకాశం పంతులుగారు

మంచి వక్తలకు, దేశభక్తులకు, స్వాతంత్య్ర సమర యోధులకు, రాజనీతిజ్ఞులకు జన్మనిచ్చిన జనని ఈ ఆంధ్రమాత. సర్వేపల్లి రాధాకృష్ణ, వరహాగిరి వెంకట గిరి (వి.వి.గిరి), నీలం సంజీవరెడ్డి గారు భారత రాష్ట్రపతి పదవి నలంకరించిన ఆంధ్రులు. పి.వి. నరసింహారావుగారు భారత ప్రధానమంత్రిగా సారధ్యం వహించారు. తెలుగుకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన వారిలో శ్రీ నందమూరి తారక రామారావుగారు అగ్రగణ్యులు. అనంతరం నారా చంద్రబాబునాయుడుగారు సమాచార సాంకేతిక రంగాలలో అభివృద్ధికి చేయూతనిచ్చి, ప్రోత్సహించి ప్రపంచ పఠంలో ఆంధ్ర రాష్ట్ర స్థానాన్ని పదిలం చేసారు. నోబుల్ బహుమతి గ్రహీత సర్. సి.వి. రామన్, ఆంగ్లేయులను గడగడలాడించిన అల్లూరి సీతారామరాజు, ఆంధ్రకేశరి టంగుటూరి ప్రకాశం పంతులుగారు, కలియుగ భీముడు కోడి రామమూర్తి, విశ్వకర్మ తరువాత విశ్వకర్మ మోక్షగుండం విశ్వేశ్వరయ్యగారు, ఇలా రాస్తూపోతే ఈ ప్రవాహం అనంతం. ఈ చిన్న వ్యాసంలో ఎందరో మహానుభావులను, మరెన్నో మహత్తర ఘట్టాలను ప్రస్థావించడం సాధ్యపడలేదు. మన రాష్ట్రమునకు, మన రాష్ట్రపౌరులకు ఈనాటి గుర్తింపునకు కారణమైన అందరికి మహనీయులందరికి నమస్సులను తెలియజేసుకుంటూ - సర్వేజనా: సుఖినోభవంతు! సకల సన్మంగళాని సంతు! అసతోమా సద్గమయ; తమసోమా జ్యోతిర్గమయ; మృత్యోర్మా అమృతంగమయ; ఓం శాంతి: శాంతి: శాంతి:

### మరొక్కసారి గుర్తు చేసుకుందాం!

| | |
|---|---|
| ఆంధ్రప్రదేశ్ అవతరణ | : నవంబరు 1, 1956. |
| మొదటి ముఖ్యమంత్రి | : శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులుగారు. |
| రాజధాని | : హైదరాబాదు. |
| జిల్లాలు | : 23. |
| రాష్ట్రీయ పక్షి | : పాల పిట్ట. |
| రాష్ట్రీయ పుష్పం | : కలువ. |
| రాష్ట్రీయ చిహ్నం | : పూర్ణ కుంభం. |